Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

# మీ ఇంటికొచ్చేందుకు జియో సిద్ధం!

జియో గిగాఫైబర్ రాకకు ముందే విలీనాలు




ఇంటర్నెట్‌డెస్క్‌: ‘రిలయన్స్‌ జియో’ భారతీయ టెలికామ్‌ రంగం రూపురేఖలను సమూలంగా మార్చేసిన సంస్థ. భారత్‌లోని టెలికామ్‌ రంగం గురించి చెప్పాలంటే జియోకు ముందు.. జియో తర్వాత అని చెప్పాలేమో అన్నంతగా ప్రభావం చూపింది. జియో వచ్చిన తర్వాత డేటా వినియోగంలో భారత్‌ దూసుకెళ్లింది. ఇప్పుడు జియో ఫైబర్‌ టు ది హోం(ఎఫ్‌టీటీహెచ్‌) సేవలతో మార్కెట్లోకి వచ్చేందుకు సిద్ధమవుతోంది.

ఎఫ్‌టీటీహెచ్‌ సేవలు అంటే ఏమిటీ..?

ఫైబర్‌ టు ది హోం(ఎఫ్‌టీటీహెచ్‌) లేదా ఫైబర్‌ టు ది ప్రిమిసెస్‌(ఎఫ్‌టీటీపీ) అని కూడా అంటారు. ఒక కేంద్రం నుంచి ఆప్టికల్‌ ఫైబర్‌ నెట్‌వర్క్‌ను నేరుగా ఇంటికి వేయడాన్ని ఎఫ్‌టీటీహెచ్‌ అంటారు. ప్రస్తుతం చాలా ఫైబర్‌ కేబుల్‌ సర్వీసుల్లో ఇంటర్నెట్‌ కొంత నిదానంగా ఉంటుంది. కానీ జియో గిగా ఫైబర్లో అల్ట్రా హై డెఫినెషన్‌ ఎంటర్‌ టైన్‌మెంట్‌ టీవీ సేవలు, వీడియో కాన్ఫరెన్స్‌, వాయిస్‌ యాక్టివేటెడ్‌ వర్చువల్‌ అసిస్టెన్స్‌, వర్చువల్‌ గేమింగ్‌, డిజిటల్‌ షాపింగ్‌ వంటి సేవలు అందుతాయి. ఇవన్నీ జియో గిగా ఫైబర్‌కు అదనపు బలాలుగా నిలుస్తాయి.

ప్రస్తుత పరిస్థితి..

ప్రస్తుతం డీటీహెచ్‌ ప్రసారకర్తలు రెండు రకాల సవాళ్లను ఎదుర్కొంటున్నారు. కంటెంట్‌కు సంబంధించి ప్రధాన డీటీహెచ్‌ కంపెనీలు కూడా కొరతను ఎదుర్కొంటున్నాయి. వీక్షకుల సంఖ్యను పెంచడంలో కంటెంట్‌దే కీలక పాత్ర. ఇక పంపిణీ విషయంలో కొన్ని సంస్థలకు సవాళ్లు ఎదురవుతున్నాయి. చాలా డీటీహెచ్‌ సంస్థలు ఇంటర్నెట్‌ సేవలను అందించలేకపోతున్నాయి. అవి వాటికి ప్రధాన లోపం. ఇటీవల ట్రాయ్‌ డీటీహెచ్‌ ధరలకు కళ్లెం వేయడంతో లాభాల కోసం కొత్త మార్గాలను వెతకాల్సిన పరిస్థితి నెలకొంది.

విలీనాల బాట..

జియో గిగాఫైబర్‌ మార్కెట్‌లో అడుగు పెట్టడానికి ముందే డీటీహెచ్‌లో విలీనాలు జోరందుకున్నాయి. చివరి దశ విలీనాలు 2017లో మొదలయ్యాయి. డిష్‌టీవీ- వీడియోకాన్‌ డీ2హెచ్‌, రిలయన్స్‌ బిగ్‌టీవీ -వీకన్‌ మీడియా, టెలివిజన్‌ల విలీనాలు

జరిగాయి. ఈ నేపథ్యంలో భారతీ ఎయిర్‌టెల్ తాజాగా డిష్‌టీవీపై ఆసక్తి చూపిస్తోంది.

ప్రస్తుతం డిష్‌టీవీనే దేశంలో అతిపెద్ద డీటీహెచ్ ఆపరేటర్‌గా నిలిచింది. దీని తర్వాతి స్థానాల్లో టాటా స్కై, ఎయిర్‌టెల్ డీటీహెచ్‌లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గురువారం భారతీ ఎయిర్ టెల్ - డిష్‌టీవీలు విలీనం కానున్నాయనే వార్తలు వెలువడ్డాయి. దీంతో డిష్‌టీవీ షేర్లు ఇంట్రాడేలోనే భారీగా పెరిగాయి. వాస్తవానికి ఎయిర్‌టెల్ కూడా సింగ్‌టెల్‌తో కలిసి డిష్ టీవీలో 60శాతం వాటాల కొనుగోలు అంశాన్ని పరిశీలిస్తోంది. ఈ డీల్ విలువ రూ.6,000 కోట్లకు పైగా ఉండవచ్చని అంచనా. ఇప్పటికే డిష్‌టీవీలోని 80శాతం ప్రమోటర్ వాటాలు మొత్తం పెట్టుబడిదారుల వద్ద తాకట్టులో ఉన్నాయి. జియోను సమర్థంగా ఎదుర్కొనేందుకు టాటా స్కై కూడా రంగం సిద్ధం చేసుకొంటోంది.

ఆర్థికవనరులను సిద్ధం చేసుకొనేందుకు బలమైన పెట్టుబడిదారుల కోసం వేట మొదలుపెట్టింది. టెమసెక్, టాటా ఆర్ప్యొనిటీస్ ఫండ్‌లకు టాటాస్కైలో దాదాపు 19శాతాం వాటాలు ఉన్నాయి. బలమైన పెట్టుబడిదారులకు తమ వాటాలను విక్రయించి ఇవి బయటకు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. టాటాస్కైలో మెజారిటీ 51శాతం వాటాలు టాటాసన్స్ వద్ద ఉండగా మరో 30శాతం వాటాలు వాల్ట్ డిస్నీ చేతికి వెళ్లాయి. వాల్ట్ డిస్నీ ఇటీవలే ట్వంటీఫస్ట్ సెంచరీ ఫాక్స్‌ను కొనుగోలు చేయడంతో ఈ వాటాలు దక్కాయి. గతంలో ట్వంటీఫస్ట్ సెంచరీ ఫాక్స్‌కు దీనిలో వాటాలు ఉండేవి.

100 మెగాబైట్ల వేగంతో జియోగిగా ఫైబర్..!

ప్రస్తుతం రిలయన్స్ జియో గిగాఫైబర్‌ను ముంబయి, దిల్లీ, సూరత్, అహ్మదాబాద్ పట్టణాల్లో ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నారు. 100 ఎంబీపీఎస్ వేగంతో పనిచేసే కనెక్షన్లు ఆఫర్ చేస్తున్నారు. దీనికి నెలకు 100 జీబీ డౌన్‌లోడ్లను ఇస్తున్నారు. వినియోగదారులు రౌటర్‌కు రూ.4,500 చెల్లించాలి. ఈ మొత్తాన్ని చివర్లో రీఫండ్ చేస్తారు. దీనికి రిలయన్స్ డెన్, హాత్‌వే నెట్‌వర్క్‌లను కూడా వాడుకొనే అవకాశం ఉంది. వీటి కొనుగోలును గత నెలలోనే పూర్తి చేసింది. జియో ఫైబర్ బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్ ఈ ఏడాది ద్వితీయార్థంలో మార్కెట్లోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only.
To know more, please visit: www.freegurukul.org